# పువ్వుల్లోని విగ్రహాలు నవ్వాయి



అమరావతి దేవాలయంలో పది కుటుంబాల వారు అర్చకులు. అందరి అర్చకుల్లోకి పెద్ద, పెద్దయ్యగారు. పెద్దయ్యగారి కొడుకు నారాయణ ఆరేళ్ళ పసివాడు. అక్షరాభ్యాసం చేసి ఎంతో కాలం కాకపోయినా, అ-ఆ-లు సొంతం రాకపోయినా కుంచె కోలతో పెద్దగుడి తలుపులు తీయటం చేతనవు. స్వామి దగ్గర అఖండ దీపారాధన కునికి పోకుండా చూడటం చేతనవు. స్వామి నిర్మాల్యం తీయడం చేతనవు. శఠగోపురం పెట్టడం చేతనవు. కాని డబ్బులు లెక్కెట్టుకోటం చేతకాదు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటాక పెద్దయ్యగారు అర్చకుల ఇంటింటికి వెళ్ళి ''ఒరేయ్ గోపాలం నైవేద్యం... ఒరేయ్ కృష్ణమూర్తి నైవేద్యం'' అంటూ చెప్తుంటే పక్కనున్న నారాయణ తన తోటి వయసు వాళ్ళతో ''ఒరే సుబ్బి నైవేద్యం! ఒరే కంకు పక్షీ నైవేద్యం....'' అని తన జతగాళ్ళని కేకేసేవాడు.

పదిమంది అర్చకులు నైవేద్యప్పళ్ళాలు తీసుకుని దేవాలయానికి బయలుదేరితే వాళ్ళ వెనక ఆరేడేళ్ళ పిల్లలు మడిగట్టుకుని తండ్రుల వెంట బయలు దేరేవారు. ఇళ్ళ దగ్గర తల్లుల్ని వేధించి పిల్లలు అంగోస్త్రాలు గోచీ పోసి కట్టింపించుకునేవారు. వాళ్ళు కూడా చిన్న చిన్న నైవేద్యాలు చిన్న పళ్ళాల్లో పెట్టించుకుని, గ్లాసుల్తో నీళ్ళు తీసుకుని తండ్రుల వెంట బయలుదేరేవారు.

ముందు పదిమంది అర్చకులు పెద్ద పళ్ళాలతో మహానివేదన తీసికెళ్తుంటే వాళ్ళవెంట మరో పది చిన్న నైవేద్యాలు! గోచీలూడి పోతుంటే మళ్ళీ దోపుకుంటూ తండ్రుల వెంట గునగున నవ్వుతూ పరుగెత్తుతున్న పిల్లలు. కాళ్ళు స్సరున కాలుతున్నా లెక్క చేయకుండా, గ్లాసుల్లో నీళ్ళు తొణికిపోతున్నా గమనించకుండా పోటీపడి పరుగెత్తటాలు. అలా రెండవ ప్రాకారంలోకి వచ్చేసరికి అక్కడ పరిచి వున్న నాపరాయి బండలు ఎండకి సలసల కాగుతుంటే వాటిమీద పిల్లల లేతపాదాలు స్సరున కాలి పోగా పిల్లలు పరుగెత్తినంత దూరం పరుగెత్తి ఇక లాభం లేదని గ్లాసుల్లో నీళ్ల కాసిని ఆ బండలమీద వొంపుకుని ఆ నీళ్ళలో నుంచునేవారు. మండుతున్న బండలమీద ఆ నీళ్ళు బుసబుస పొంగి కాళ్ళు మరీ కాలేవి. ''కుయ్యో'' మంటూ మెట్లవైపు పరుగులు పెట్టే వారు. వొద్దంటే విన్నారా అన్న పెద్దల మందలింపులు విన్పించుకోకుండా.

ఎట్టకేలకు గుళ్ళోకి చేరుకుని నైవేద్యప్పళ్ళాలు స్వామి ముందు పెట్టి గంధంసాన ముందు చేరే వారు. గంధం చెక్క తీసుకుని ఆ పెద్ద సానమీద చేతులు నొప్పులు పుట్టేదాకా వంతుల వారీగా గంధం అరగ తీసేవారు. వాళ్ళ పెద్దలు గంధం, కుంకుమ పెట్టుకుని, పిల్లలందరికి గంధం బొట్టు పెట్టి వొంటినిండా గంధం పూసేవారు. ఆపైన ధూప దీపా లిస్తున్నప్పుడు, గంటలు, జేగంటలు మోగించడం పిల్లల వంతు. అలా మహానివేదనలు ముగించుకుని నుదుట గంధాక్షతలు వెలుగుతూండగా ఇరవై నైవేద్యప్పళ్ళాలు గుడి మెట్లు దిగుతూంటే చూడవలసిందే!

'శివరాత్రి ఉత్సవాలగ్గాను పులికాపు చెయ్యాలి రండర్రా' అని పెద్దయ్యగారు పెద్ద లందర్నీ తొందర చేస్తే నారాయణ పిల్లల్నందర్నీ కూర్చి ''మేమూ వస్తాం'' అన్నాడు. సరే అన్నారు పెద్దలు. పులికాపు అంటే స్వామి విగ్రహాలకు స్నానం చేయించి, కొత్త బట్టలు కట్టడం. ఒక విగ్రహమా? రెండా? దాదాపు పది విగ్రహాలు! కంచుపోత పోసిన విగ్రహాలు! నాలుగున్నర అడుగులెత్తు విగ్రహాలు! నలుగురు పడ్తేగాని కదలని విగ్రహాలు!

విగ్రహాలన్నింటిని ఉత్తర మంటపంలోకి చేర్చారు. పెద్దలు విగ్రహాలు మోస్తుంటే పిల్లలు కూడా ఓ పక్క పట్టుకుని మోస్తున్నట్టు నటిస్తూ వాళ్ళతోపాటే అమ్మ: అయ్య! అంటున్నారు. రెండు గుండిగల నీళ్ళు కృష్ణ నించి తెచ్చేరు. పిల్లలు కూడా పానకం బిందెలతో నీళ్ళు మోశారు. విగ్రహాలన్నింటినీ ముందు చింతపండు పులుసుతో తోమారు. ఆపైన ఇసక తెన్నెల్లోంచి ప్రత్యేకంగా తెచ్చిన మెత్తటి ఇసుకతో విగ్రహాల్ని రుద్ది తళతళలాడేట్టు చేశారు.

ఆపైన విగ్రహాలకు బట్టలు కట్టాలి. అమ్మవారికి చీర, అయ్యవారికి ధోవతి, చండీశ్వరుడికి పాగా, ఊరేగింపు విగ్రహాలకు వేరే బట్టలు, ఇలా అలంకారాలు చేయాలి. అందరూ తలా ఒక విగ్రహానికి బట్టలు కడ్తున్నారు. పెద్దయ్యగారు చిన్న ఉత్సవ విగ్రహాలకు బట్టలు కడుతున్నారు. ఆ విగ్రహాలే ఆ రోజు నందివాహనం మీద ఊరేగింపుకు వెళ్తాయి. నారాయణ మెల్లగా తండ్రి దగ్గరకు చేరాడు.

''ఏరా! నువ్వు అలంకారం చేస్తావా?'' అన్నాడు పెద్దయ్య.

''ఓ'' అన్నాడు నారాయణ.

''అయితే కుచ్చిళ్ళు గట్టిగా పట్టుకో'' అన్నాడు పెద్దయ్య.

పెద్దయ్య విగ్రహానికి ముడి వెయ్యటమేమి, నారాయణ వెనకనుంచి ముడి విప్పట మేమి-అలా అరగంటైనా అలంకారం పూర్తి కాలేదు.

పెద్దయ్య నవ్వుతూ ''ఒరేయ్! నాయనా ఇలా ముందుకొచ్చి కూర్చో'' అని అలంకారమంతా పూర్తిచేశాడు.

అలంకారమంతా తనే చేసినంత తృప్తి వచ్చింది నారాయణకి. అమ్మవారి చీర సర్దాడు. స్వామి ఉత్తరీయం సరిచేశాడు. దూరంనించి చూశాడు. దగ్గర నుంచి చూశాడు. పూసల పేర్లు దిద్దాడు. ఇలా అలంకారమంతా పూర్తి చేసిన గర్వంతో మిగతా పిల్లలందర్నీ చూశాడు. నారాయణకి చటుక్కున ఓ ఆలోచ నొచ్చింది. ''ఇప్పుడే వస్తా....'' అని రయ్యిని ఇంటికి పరుగెత్తికెళ్ళి దొడ్లో ఆ రోజే విచ్చుకున్న రెండు మందార పూలని తీసికొచ్చి స్వామికి, అమ్మవారికి అలంకరించి పొంగిపోయి చప్పట్లు చరిచాడు.

ఆ సాయంత్రమే నంది వాహనం ఊరేగింపు. బజారు బజారంతా చెప్పాడు. నేనే స్వామికి అలంకారం చేశానని - పిల్లల్నందర్నీ పోగేసుకొచ్చాడు నారాయణ. నంది వాహనం వొడ్డెర్లే మోయాలి. రాత్రి ఎనిమిదైనా వాళ్ళింకా రాలేదు. వాళ్ళకోసం మూడోసారి మనిషిని పంపించాడు. దేవస్థానం ట్రస్టీ వాళ్ళనీ వీళ్ళనీ కేకలేస్తూ హడావుడిగా తిరుగుతున్నాడు.

వాహకులు ఆలస్యంగా వచ్చినందుకు మీ తప్పంటే మీ తప్పని అరుచుకొన్నారు జనం. ఎట్టకేలకు స్థానాపతిగారు మంత్రం చదువుతూ ముందు నడిచారు. వాద్యాలన్నీ ఒక్కసారి మోగాయి. విగ్రహాలు గుళ్ళో నించి క్రింది ప్రాకారానికొచ్చాయి. విగ్రహాల్ని నంది వాహనం మీది కెక్కించారు. కాని వాహనం లేవందే?

వొడ్డెర్లు తగూలాడుకుంటున్నారు. ''నీ యమ్మ! తప్పు నీదే! నీ యక్క! తప్పు నీదే!'' వాదులాడుకొంటున్నారు. దెబ్బలాట ఒకటే తక్కువ.

''వాహనం లేపండ్రా'' అని అధికార్ల అరుపులు - ''పట్టండ్రా! పట్టండ్రా''

హర హర మహాదేవ...

నంది వాహనం అటూ ఇటూ ఊగింది. విగ్రహాలు వొరిగాయి.

''ఒరేయ్ జాగ్రత్తరోయ్!'' అర్చకుల అరుపులు.

ఊరేగింపుకు ముందు అర్చకుడు హారతి ఇస్తున్నాడు.

ఆ వూపుతో ఆ కుదుపుతో నారాయణ అలంకరించిన రెండు మందార పూలు ఎక్కడో పడిపోయాయి. నారాయణ బిక్క మొహం వేశాడు. కాని విగ్రహాలు నవ్వుతూనే ఉన్నాయి. తనూ నవ్వాడు.

*